పిహెచ్‌సి సందర్శన


గర్భిణితో మాట్లాడుతున్న డాక్టర్ అమృతం

కొయ్యలగూడెం : బయ్యనగూడెం పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పిజె.అమృతం సందర్శించారు. పిహెచ్‌సిలో అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రోజు ఎంతమంది రోగులు వెళ్తున్నారు? అన్ని రకాల ల్యాబ్ రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయా? వంటి విషయాలను విచారించారు. పిహెచ్‌సిలో ప్రసవాలు జరిగేలా సిబ్బంది మరింత కృషి చేయాలని సూచించారు. అలాగే అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు 100 శాతం అమలు కావాలని అధికారులను ఆదేశించారు. పిహెచ్‌సికి అందిస్తున్న సేవలపై తాను సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.గీతారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి యెల్లు సుబ్రహ్మణ్యం, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

సోషలిజమే సమస్యలకు పరిష్కారం

సిఐటియు ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు

ఘనంగా సిఐటియు అఖిలభారత మహాసభ సందర్భంగా సదస్సు

ఏలూరు జ్యూట్‌మిల్లు సెంటర్ నుంచి సభాస్థలికి భారీ ప్రదర్శన

పెద్దఎత్తున హాజరైన కార్మికులు, మహిళలు

అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొద్దిమంది వ్యక్తుల వద్ద పోగుబడిన సంపద, పెట్టుబడిదారీ విధానం పతనానికి దారితీస్తుందని సిఐటియు ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు, ఇతర వక్తలు అన్నారు. స్థానిక సీతారామ భర్తీయా కళ్యాణ మండపంలో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో 'ప్రపంచ పరిణామాలు-సోషలిజమే పరిష్కారం' అనే అంశంపై రాష్ట్ర సదస్సు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన జరిగింది. తొలుత స్థానిక జ్యూట్‌మిల్లు సెంటర్ నుంచి కోటదిబ్బ వద్ద ఉన్న సీతారాం భర్తీయా కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికులు, నేతలు ఎర్రజెండాలు చేతపట్టి సిఐటియు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం సదస్సు వేదికపై బుట్టాయగూడెం అంగన్వాడీ కార్యకర్తల ప్రదర్శించిన గిరిజన నృత్యం అందరినీ అలరించింది. సదస్సు ప్రారంభంలో సిఐటియు పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల బాబూరావు చిత్రపటానికి రాఘవులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బివి.రాఘవులు మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానం పేదల పొట్టలు కొట్టి, సంపదను కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల్లో బంధిస్తుందని, నేటి ప్రపంచ పరిణామాలే దీనికి ఉదాహరణ అని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కార్పొరేట్, సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా జరిగిన న్యూయార్క్ మేయర్ ఎన్నికల ద్వారా ప్రజలు తమ సంఘటిత శక్తిని ప్రపంచానికి చాటారని ప్రశంసించారు. రాబోయే కాలం కమ్యూనిస్టులకు సానుకూల వాతావరణం ఏర్పడబోతుందని, మార్పు అనివార్యం అని తేల్చి చెప్పారు. సోషలిజమే అన్ని సమస్యలకూ పరిష్కారమన్నారు.

మాట్లాడుతున్న బివి.రాఘవులు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, కార్మిక వ్యతిరేక పాలన సాగుతుందన్నారు. సంపద సృష్టి అంతా కార్మికవర్గంతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వంలో అంగన్వాడీలు, ఆశాలు తదితర కార్మికుల జీతాల పెంపు కోసం పోరాటాలు చేస్తే తెలుగుదేశం నాయకులు శిబిరాలకు వచ్చి మద్దతు తెలిపి, తమ ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 18 నెలలు గడిచినా ఇప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కరించ లేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు మాట్లాడుతూ సెక్యులరిజం, సోషలిజం రాజ్యాంగంలో ఉండకూడదని చెబుతున్నారన్నారు. కార్పొరేట్లకు దాసోహమై మోడీ ప్రభుత్వరంగ సంస్థలను సర్వనాశనం చేశారన్నారు. కేరళ పేదరికం లేని రాష్ట్రంగా నిలిచిందని, కమ్యూనిస్టుల వల్లే ఇది సాధ్యమైందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఏ సమస్య వచ్చినా సిఐటియు ముందుంటుందన్నారు. దేశంలో మోడీ పాలన వచ్చాక కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని, ఈ నేపథ్యంలో సిఐటియు జాతీయ మహాసభ ద్వారా కార్మికుల సత్తా చాటి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. మహాసభ విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ సిఐటియు నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ యుటిఎఫ్ భాగస్వామ్యం ఉంటుందని, సిఐటియు జాతీయ మహాసభ మన రాష్ట్రంలో జరగడం గర్వకారణమని, మహాసభ విజయవంతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జివిఎల్.నరసింహారావు, జనవిజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్.రమేష్, ఉద్యోగ సంఘ నాయకులు ఎల్.విద్యాసాగర్ తదితరులు మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభకు విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని, దీనికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం సిఐటియు నాయకులు నాగమణి, ఇస్సాక్ ప్రత్యేక గీతం ఆలపించారు. ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు నాయకులు జి.రాజు, పి.భారతి, కె.పోశమ్మ, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నగరంలో ర్యాలీ

రెండు డివిజన్లతో జిల్లా?

నూజివీడు నియోజకవర్గం ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరు కృష్ణా జిల్లాలో కలిపేందుకు సుముఖం

ఐదు నియోజకవర్గాలు, రెండు డివిజన్లతో అతిచిన్న జిల్లాగా ఏలూరు

వేరే నియోజకవర్గాలను కలుపుతారా అంటూ జనాల్లో ఉత్కంఠ

ఏలూరు జిల్లాలోకి గణపవరం మండలం

పోలవరం జిల్లా ఏర్పాటు లేనట్టేనా..?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా ముఖచిత్రం మారనుందా.. రెండు రెవెన్యూ డివిజన్లతో అతి చిన్న జిల్లాగా అవతరించనుందా అంటే అవుననే సమాధానం వస్తోంది. మంత్రివర్గ ఉపసంఘం చర్చల సారాంశం అందుకు అద్దం పడుతోంది. గత ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికగా జిల్లాల విభజన చేసింది. అందులో భాగంగానే ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కైకలూరు, నూజివీడు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో కలిపింది. దీంతో ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం, నూజివీడు, కైకలూరు మొత్తం ఏడు నియోజకవర్గాలు, మూడు రెవెన్యూ డివిజన్లతో జిల్లాగా ఏర్పాటైంది. భౌగోళిక పరిస్థితుల రీత్యా రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న ద్వారకాతిరుమల మండలాన్ని ఏలూరు జిల్లాలో కలిపి, ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలిపింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాల విభజనలో ఏర్పడిన సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘం జిల్లాలో పర్యటిస్తుందని పేర్కొన్నప్పటికీ అది జరగలేదు. ఉపసంఘం వద్దకు వచ్చిన వినతుల ఆధారంగా నివేదికను తయారు చేస్తోంది. ఎన్నికల సమయంలో నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాన్ని కలిపి పోలవరం జిల్లాను ఏర్పాటు చేస్తామని సైతం ప్రకటించారు. మంత్రివర్గ ఉపసంఘం చర్చల సారాంశం చూస్తే ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరును కృష్ణా జిల్లాలో కలిపేందుకు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఏలూరు జిల్లాలో ఇక ఐదు నియోజకవర్గాల పరిధిలోని 19 మండలాలు మాత్రమే మిగులుతాయి. గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలిపితే 20 మండలాలు అవుతాయి. పోలవరం జిల్లా ఏర్పాటుపై ఉపసంఘం ఎటు వంటి స్పష్టతా ఇవ్వలేదు. ఏజెన్సీ మండలాలను ఏలూరు జిల్లాలో ఉంచుతారా.. లేక చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లతో ఏర్పాటు చేయాలని చూస్తున్న ప్రత్యేక అథారిటీ పరిధిలోకి తీసుకెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ మండలాలను అథారిటీ పరిధిలోకి తీసుకెళ్తే ఏలూరు జిల్లా మరింత కుచించుకుపోయే పరిస్థితి ఏర్పడనుంది. ఐదు నియోజకవర్గాలతో జిల్లాగా ఏర్పాటు చేస్తారా.. లేక గోపాలపురంతోపాటు మరో నియోజకవర్గాన్ని కలుపుతారా అనే చర్చ సైతం జనాల్లో నడుస్తోంది. నూజివీడు డివిజన్ ఎన్‌టిఆర్ జిల్లాలో కలిపితే ఏలూరు జిల్లాలో కేవలం ఏలూరు, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్లు మాత్రమే మిగులుతాయి. ఆదాయ వనరులు సైతం బాగా తగ్గిపోతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లాల విభజన సమస్యలపై స్పష్టత వచ్చే వరకూ అంతా సస్పెన్స్ కొనసాగనుంది.



ప్రజాప్రతినిధుల మౌనంపై చర్చ

జిల్లాల విభజనలో జరుగుతున్న పరిణామాలపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏలూరు జిల్లా చిన్నదిగా మారితే ఆర్థిక వనరులు సైతం పెద్దగా ఉండవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు నియోజకవర్గాలను విభజిస్తున్నప్పుడు వేరే ప్రత్యామ్నాయం గురించి ప్రజాప్రతినిధులు మాట్లాడాలిగా అనే చర్చ జనాల్లో నడుస్తోంది.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

భవిష్యత్తు తరాలకు రసాయనిక రహిత ఆహారాన్ని అందించడానికి ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని, జిల్లాను ప్రకృతి వ్యవసాయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు 'నేచర్ వారియర్' బాధ్యతలను మహిళలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక ఐఎడిపి హాలులో గురువారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లాను ప్రకృతి వ్యవసాయ హబ్‌గా తీర్చిదిద్దడంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ రూపకల్పన ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యమన్నారు. ప్రకృతి వ్యవసాయం అంటే ప్రకృతిని కాపాడటమేనన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం కారణంగా సాగు ఖర్చు తగ్గడంతోపాటు అధిక ధర లభించి, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడతాయని, భూసారం పెరుగుతుందని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించేందుకు ప్రతిఒక్కరూ, ముఖ్యంగా మహిళలు కృషి చేయాలన్నారు. మహిళలు తలచుకుంటే చేయలేనిదేదీ లేదని, వారిపై తనకు నమ్మకం ఉందని అన్నారు. అందుకే మహిళలను 'నేచర్ వారియర్'గా పిలుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 117 మంది టి-ఐసిఆర్‌పిలుగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేష్, వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

భూమిలేని పేదలకు భూపంపిణీ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ఘనంగా ముగిసిన సంఘం 32వ జిల్లా మహాసభ

మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - టి.నరసాపురం

జిల్లాలో ఊరూరా వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఎగరాలని, కార్మికులంతా ఐక్యంగా పోరాడితేనే హక్కులు సాధించుకోగలమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆ సంఘం 32వ జిల్లా మహాసభ రెండో రోజు గురువారం కొనసాగింది. రెండో రోజు సభను వి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మహాసభ ప్రారంభ సూచికగా సంఘం జెండాను సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు ఆవిష్కరించారు. మహాసభకు అధ్యక్షవర్గంగా ఎం.జీవరత్నం, తామా ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, డి.రవీంద్ర వ్యవహరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో భూమిలేని పేదల కోసం, ఉపాధి హామీ కూలీల సమస్యలు, ఇళ్ల స్థలాలు, పామాయిల్ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారన్నారు. భూమిలేని పేదలకు భూపంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అసైన్డ్ భూములపై 9/77 చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని కోరారు. అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని త్వరలోనే తొలగించి రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, దళితులకు ఉపయోగపడే అసైన్డ్ భూములను అభివృద్ధి పేరుతో వారి వద్ద నుంచి బలవంతంగా భూసేకరణ పేరుతో ప్రభుత్వం లాగేసుకోవడం దుర్మార్గమన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలకు పేదల భూములు లాక్కోవడం ఆనవాయితీగా మారిందన్నారు. దళితులు, పేదలకు సంక్షేమ పథకాలు సాకు చూపి సాగు చేసుకుంటున్న భూములను సైతం భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నానికి పూనుకున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూముల విధానంలో భూకబ్జాదారులకు తీపి కబురు, లక్షలాది మంది దళిత, బలహీనవర్గాలకు చేదు కబురుగా ఉందని ఎద్దేవా చేశారు. బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు పని చేసిన ఎస్ఆర్.శంకరన్ పోరాడి 9/77 చట్టం తీసుకొస్తే నేటి కూటమి ప్రభుత్వం ఈ చట్టాన్ని పేదలకు దూరం చేయాలని, చట్టంలోని అంశాలను సవరిస్తూ నిర్వీర్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఐదు దశాబ్దాలుగా ప్రభుత్వాల నుండి లబ్ధి పొందిన దళిత, బలహీన వర్గాలకు చెందిన అసైన్డ్ భూములను పలుకుబడి కలిగిన వారికి, గ్రామీణ సంపన్నులకు కట్టబెట్టడానికే ఈ ఫ్రీ హోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడానికి రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం చేసిందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలకు వ్యవసాయ కార్మిక సంఘం సిద్ధమవుతోందన్నారు. పేదల పక్షాన పోరాటంలో ఎర్రజెండా ముందుంటుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని, అందుకే పేదలంతా సంఘటితం కావాలని అన్నారు. రానున్న సర్పంచి ఎన్నికల్లో కార్మిక పోరాట ప్రాంతాలైన జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం వంటి ప్రాంతాల్లో కార్మికులు పోటీ చేసి గెలవాలని, ఎర్రజెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లాలో 18 మండలాల నుండి 150 మంది ఎంపిక చేసిన ప్రతినిధులు హాజరయ్యారు. కార్యదర్శిపై మండలాలు, రంగాలవారీ చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో పేదల భూములను అక్రమంగా అన్యాక్రాంతం చేసి, దౌర్జన్యంగా అనుభవిస్తున్న వారిపై నేటికీ ఒక్క కేసు లేదని గుర్తు చేశారు. పేదలు తమ భూముల కోసం పోరాడుతుంటే పోలీసులను ఉసిగొల్పి అక్రమ కేసులు బనాయించడం ఈ ప్రభుత్వాలకు కొట్టిన పిండని విమర్శించారు. మంత్రివర్గ ఉపసంఘం ఫ్రీ హోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తేసి ఇప్పటికే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న వారికి రెగ్యులర్ చేయబోతున్నట్లు, త్వరలోనే మీకు తీపి కబురు అందిస్తామని చెప్పడం లక్షలాది మంది దళితులు, బలహీన వర్గాలకు చెందిన పేదలకు తీవ్ర ద్రోహం చేసినట్లేనని అన్నారు. 9/77 చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని, అనర్హుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.సీత, సాయికృష్ణ, హోలీమేరీ, చిన్న మాధవ, రాము, చలపతి, మడకం సుధారాణి, మడకం కుమారి, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎ.రవి

అర్హులకు ఇంటి స్థలం మంజూరు

సబ్ కలెక్టర్ బి.వినూత్న

ముసునూరు : అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలం మంజూరు చేయబడుతుందని నూజివీడు డివిజన్ సబ్ కలెక్టర్ బి.వినూత్న పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కాట్రేనీపాడు గ్రామంలో తహశీల్దార్ డి.ప్రశాంతి, సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు, ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఇళ్ల స్థలాల పరిష్కార సమస్యలపై అర్జీలు తీసుకున్నారు. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం కాట్రేనీపాడు గ్రామంలో 121 మంది అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ఇండ్ల పట్టాలు వారికి అందజేయగా ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాధికారులు కూడా ఎవరి స్థలం ఎక్కడ అనే పొషన్ చూపించక పోవడంతో అప్పటినుండి నేటి వరకు ప్రభుత్వాలు మారుతున్నాయి, అధికారులు మారుతున్నారు.. కానీ అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలం చూపించడం లేదు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి ఈ విషయం గ్రామస్తుల నుండి తెలియపరచగా మంత్రి ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ బి.వినూత్న గ్రామంలో లబ్ధిదారులను గుర్తించేందుకు బహిరంగ సభ కార్యక్రమం ఏర్పాటు చేసి, పట్టాలు లేని వారికి మరలా పట్టాలు ఇచ్చే విధంగా, అర్హులైన వారికి ఇళ్ల స్థలం మంజూరు చేసే విధంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు పోరంబోకు భూములలో నివాసం ఉండరాదని, పొజిషన్ సర్టిఫికెట్ లేకుండా అక్రమంగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉండరాదని గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులైన ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్ఓ మణింద్ర, టిడిపి నాయకులు గద్దల మోహనరావు, సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్ పాల్గొన్నారు.

రామారావు ఫ్రెండ్లీ ఎంఇఓగా రాణించారు : ఎంఎల్ఎ

చింతలపూడి : లింగపాలెం మండల విద్యాశాఖాధికారిగా కంట రామారావు ఒక బాధ్యతగల అధికారిగా పనిచేశారని, అలాగే పాఠశాలలో పనితీరును మెరుగుపరిచారని చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న కంట రామారావు ఉద్యోగ విరమణ వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరితో కలివిడిగా ఉంటూ ఒక ఫ్రెండ్లీ ఎంఇఓగా రాణించారన్నారు. వారి కుటుంబంలో కూడా పిల్లలను ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దారు అని తెలియజేసారు. అనంతరం రామారావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల స్థాయిలో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్

రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు జెడ్‌పి విద్యార్థిని

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మక్కినవారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని యర్రంశెట్టి అనసూర్య తేజ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వర రావు తెలిపారు. స్థానిక పాఠశాలలో విద్యార్థినికి గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన పెదవేగి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో బేస్ బాల్ బాలికల అండర్-14 విభాగంలో నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరుపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అనసూర్య తేజతోపాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రమేష్‌ను ఉపాధ్యాయ సిబ్బంది, పలువురు గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఉపాధ్యాయులతో విద్యార్థిని

ఘనంగా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. 2025 - 26 విద్యా సంవత్సరంలో డిగ్రీ వివిధ కోర్సుల్లో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు రాబోవు మూడు సంవత్సరాల్లో అనుసరించవలసిన ప్రణాళికను వివరించారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి కళాశాల పాటుపడుతుందన్నారు. ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన సీనియర్ విద్యార్థులను అభినందించారు. ముఖ్య అతిథి గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నిర్మలా కుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాకారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిడిసి కార్యదర్శి ఇరదల రఘుబాబు పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక అవసరాలకు తగిన ఎఐ లాంటి కోర్సులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అందిస్తున్నాయన్నారు. సీనియర్ అధ్యాపకులు వి.వెంకట్రావు, డాక్టర్ ఎం.రాంబాబు ప్రసంగించారు. కార్యక్రమాన్ని డాక్టర్ పిఆర్ కావ్య శ్రీ సమన్వయం చేశారు. అనంతరం మధ్యాహ్నం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు కె.రమేష్, టివిఎస్.పద్మావతి, డాక్టర్ ఎం.విజయకుమార్, ఎస్.పరమేశ, ఎం.కృష్ణచైతన్య, ఎస్.సుస్వలత, డి.సుజాత, జె.మధుసూదన్ రావు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

తివాచీ రంగానికి పూర్వవైభవం : కలెక్టర్

ఏలూరు : స్థానిక పెన్షన్ లైను లక్ష్మీవారపుపేటలో గురువారం ఏలూరు పైల్ కార్పెట్ వీవర్స్ కోఆపరేటివ్ సేల్స్ అండ్ పర్చేజీ సెంటరు, ఏలూరు అసోసియేషన్ మాన్యుఫాక్చరింగ్ సెంటర్‌ను సందర్శించి, పైల్ కార్పెట్ సొసైటీలో కొత్తగా ఏర్పాటు చేసిన రెండు లూమ్స్(ఆధునిక మగ్గాల)ను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రారంభించారు. తయారీ అవుతున్న కార్పెట్లను, తయారు చేసిన కార్పెట్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముడి సరుకును ఎక్కడ నుండి తెస్తారు, రోజుకు ఎంత మంది పనిచేస్తున్నారు, మొత్తం శ్రామికులు ఎంతమంది ఉన్నారని, రోజుకు ఎంతమంది వచ్చి కొనుగోలు చేస్తున్నారని జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఒక జిల్లా, ఒక ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రోడక్ట్) కేంద్ర ప్రభుత్వం నుండి ఏలూరు జిల్లా తివాచీ రంగానికి గుర్తింపును ఇచ్చారని తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఏలూరు కార్పెట్ రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్ర జిఎం పి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, తహశీల్దార్ కె.గాయత్రీదేవి, సొసైటీ డైరెక్టర్ మహమ్మద్ అక్బర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇంతియాజ్ అహ్మద్, జిల్లా పరిశ్రమల కేంద్ర, సొసైటీ, సచివాలయ ఉద్యోగులు, శ్రామికులు పాల్గొన్నారు.

సొంత నిధులతో బస్సు షెల్టర్ నిర్మాణం

ఉంగుటూరు : నారాయణపురం – భీమవరం వెళ్లే ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్ నిర్మాణానికి ముందుకు వచ్చిన మాజీ సర్పంచి, తెలుగు మహిళా నాయకురాలు అక్కిన నాగమణి కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. నారాయణపురంలో అక్కిన వెంకట్రావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు బుజ్జి, నాగమణి, శేషులు వారి సొంత నిధులతో ఆధునీకరణ రీతిలో నిర్మించనున్న బస్సు షెల్టర్ పనులకు గురువారం భూమి పూజ చేశారు. సర్పంచి దిడ్ల అలకనంద శ్రీను, నారాయణపురం వర్తక సంఘ సభ్యులు యాళ్ల దుర్గారావు, పెద్దిరెడ్డి అప్పలరాజు, పిఎంపి అసోసియేషన్ నాయకులు ఎర్రమూతి సత్యనారాయణ, జనసేన నాయకులు బొమ్మిడి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు

చింతలపూడి : స్థానిక చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబర్ 13వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోరారు. గురువారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్ లో క్రిమినల్, సివిల్ బ్యాంకు, రికవరీ చెక్ బౌన్స్, బిఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. రాజీ చేసుకునేవారు ప్రతిరోజు ఫ్రీ లోక్ అదాలత్ సెట్టింగ్స్ నిర్వహిస్తున్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి బార్ అసోసియేషన్ మెంబర్స్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాబూరావు మాస్టారుకు సత్కారం

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో సిల్క్ నగర్ పాఠశాలలో పని చేస్తున్న కొప్పల బాబూరావు మాస్టారు చేసిన సేవలను గ్రామస్తులు కొనియాడారు. అనంతరం బదిలీలో భాగంగా వచ్చిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.మహాలక్ష్మి ఉపాధ్యాయ బదిలీలలో భాగంగా సిల్క్ నగర్ పాఠశాల నుండి ఎంపిపిఎస్ గోపవరం(బిసి) పాఠశాలకు బదిలీపై వెళ్లిన కొప్పుల బాబూరావు మాస్టారుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన కాలంలో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, అనేక సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేలా తీర్చిదిద్దారని కొనియాడారు.

సెయింట్ థామస్‌లో ఎగ్జిబిషన్

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని సెయింట్ థామస్ హైస్కూల్ ఆవరణలో గురువారం మ్యాథ్స్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. న్యాయ నిర్ణయేతలుగా సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ జి.రవిబాబు, ఫిజిక్స్ లెక్చరర్ రాంబాబు, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ పి.బాల శౌరి, రిటైర్డ్ హెచ్ఎం టి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో మ్యాథ్స్, సైన్స్ విభాగాల్లో విద్యార్థులు వర్కింగ్ అండ్ నాన్ వర్కింగ్ మోడల్స్‌ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో వర్కింగ్ మోడల్స్ 190, నాన్ వర్కింగ్ మోడల్స్ 61 ప్రదర్శించడం జరిగింది. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని, ప్రతిభను పెంపొందించుకోవచ్చు అని స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ సృజన్ రెడ్డి, బ్రదర్ జార్జి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

నేరాలు – ఘోరాలు

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ముదినేపల్లి : ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్న వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాడవల్లికి చెందిన ఓ మహిళ ఏడు సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఆమె భర్త ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఫిర్యాది ముదినేపల్లిలోని ప్రయివేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తుంది. రెండు నెలల క్రితం కైకలూరు మండలం వేమవరప్పాడు గ్రామానికి చెందిన నాగ శివరామకృష్ణ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు పరిచయం అయ్యాడు. అనంతరం శివరామకృష్ణ మహిళ గ్రామానికి వచ్చి తన కోరిక తీర్చమని తరచూ వేధిస్తున్నాడు. వారం క్రితం గ్రామంలో పంట కాలువలో బట్టలు ఉతుకుతుండగా శివరామకృష్ణ ఆమె వద్దకు వచ్చి తన కోరిక తీర్చమని అసభ్యంగా ప్రవర్తించాడు, తన కోరిక తీర్చకపోతే అందరిలో అల్లరి చేస్తానని బెదిరించాడు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు పై ఎస్ఐ వి.వి.వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుండి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్ : గుర్తుతెలియని వ్యక్తి రైలు నుండి జారిపడి మృతిచెందిన ఘటన ఏలూరు నగరంలోని గిలకల గేటు సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని గిలకల గేటు సమీపంలో గురువారం మధ్యాహ్నం ఈస్ట్ కోస్ట్ రైలు నుండి గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఈ విషయాన్ని స్టేషన్ మాస్టర్ ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుని వివరాలు సేకరించేందుకు ప్రయత్నించారు. అతని వద్ద ఎటువంటి వివరాలు లభించలేదు. మృతుడి వయస్సు సుమారు 25 నుండి 30 సంవత్సరాలు ఉంటుందని, స్కై బ్లూ చొక్కా, బ్లూ ఫాంట్ ధరించి ఉన్నాడని రైల్వే సిబ్బంది తెలిపారు. సమాచారం తెలిసిన వారు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వాలని వారు సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం

ఏలూరు స్పోర్ట్స్ : థర్మకోల్ షీట్స్ లోడ్‌తో వెళ్తున్న లారీ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటన ఏలూరు సత్రంపాడు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. 3 టౌన్ పోలీసులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు మండలం పోతునూరు గ్రామానికి చెందిన ప్రమోవటీ బిబిఐటి కంపెనీకి చెందిన అశోక్ లేలాండ్ ఏపి 39 డబ్ల్యూ 8772 అనే నెంబర్ కలిగిన లారీ కంపెనీలో తయారు చేసిన థర్మకోల్ షీట్లను లోడ్ చేసుకుని ఏలూరు సత్రంపాడు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న మారుతి ఫిష్ ప్యాకింగ్ కంపెనీకి అన్‌లోడ్ చేసేందుకు తరలిస్తున్నారు. లారీ సరిగ్గా ఫిష్ ప్యాకింగ్ కంపెనీ సమీపానికి చేరుకునేసరికి ఒక్కసారిగా లారీ వెనుక భాగంలో విద్యుత్ వైర్లు తగిలాయి. ఒకసారిగా వెనుక భాగంలో మొదలైన మంటలతో లారీ మొత్తం దగ్ధమైంది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అనంతరం ఘటన స్థలానికి చేరుకున్న త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అయితే దీనికి కారణం లారీ సాధారణ పొడుగు కన్నా ఎక్కువ పొడుగు ఉండడం, సాధారణ ఎత్తుకన్నా ఎక్కువ ఎత్తు ఉండడమే ప్రమాదానికి కారణంగా ప్రాథమికంగా గుర్తించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

భీమడోలు : ఆగడాల లంకలో పేకాట నిర్వహిస్తున్న రహస్య స్థావరంపై భీమడోలు పోలీసులు దాడి చేశారు. ఆగడాల లంక గ్రామంలో గల ఒక పాడుబడిన ఇంట్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం అర్థరాత్రి దాడి నిర్వహించినట్లు భీమడోలు ఎస్ఐ మదీనా భాషా తెలిపారు. దాడుల సందర్భంగా పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. రూ.42,700 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శ్మశాన వాటికకు స్థలం సేకరించాలి : ఎంఎల్ఎ

చింతలపూడి : శ్మశాన వాటికలకు స్థల సేకరణ చేయాలని నియోజకవర్గం నాలుగు మండలాల తహశీల్దార్‌లను చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ ఆదేశించారు. గురువారం ఉదయం క్యాంపు కార్యాలయం నుండి నియోజకవర్గంలోని 4 మండలాల తహశీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాలలో ప్రజల అభ్యర్థన మేరకు శ్మశాన వాటికకు స్థలాలను కేటాయించవలసిందిగా ఆదేశించారు. అనేక గ్రామాల్లో శ్మశాన వాటికలు లేకపోవడం మూలంగా రోడ్ల పక్కనే అంతిమ సంస్కారాలు చేస్తున్నారని, అది బాధాకరమని పేర్కొన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికల కోసం స్థలం కేటాయింపుపై దృష్టి సారించాలని ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి : ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు వైద్య సిబ్బందికి ఆదేశించారు. గురువారం మండలంలోని దర్భగూడెం సచివాలయ ఆవరణ లో మమత మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించడంతో పాటు మిషన్ హోప్ సంస్థ ఆధ్వర్యాన పలువురికి సబ్సిడీ పై కుట్టు మిషన్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన పలువురికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. జాగృతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన పలువురికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సున్నం ఉషారాణి, జనసేన మండల అధ్యక్షులు పి.రాము, ఎంపిటిసిలు సున్నం సురేష్, నాలి శ్రీను, సొసైటీ అధ్యక్షులు ప్రసాద్, పాస్టర్ ఎజ్రా శాస్త్రి, కూటమి నాయకులు, తమ్మన సాంబ, కోనేటి హనుమంతరావు, గంగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లోనూ సత్తా

ప్రిన్సిపల్ కె.లక్ష్మీ కుమారి

ముసునూరు : తమ విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల్లో కూడా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారని ఎపి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీ కుమారి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన ముసునూరు బాలికల పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులైన ఎల్.అను, కె.తాపస్వి, సిహెచ్.దీపిక, జి.లోహిత, జె.హారికలు మండల, డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించారన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో బాపట్లలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లుగా తెలియజేశారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

భీమడోలు : విద్యార్థులకు చట్టాలపైన, తమ భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భీమడోలు ఎస్ఐ మదీనా భాషా తెలిపారు. భీమడోలు హైస్కూల్ వేదికగా గురువారం విద్యార్థులకు పోక్సో, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు–అనర్థాలు, సోషల్ మీడియా–భద్రత, ఇతర అంశాల గురించి అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోక్సో చట్టాల ప్రాముఖ్యత, లైంగిక వేధింపులు–భద్రత, ఈ విషయమై సంప్రదించవలసిన వారి వివరాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో భీమడోలు పోలీస్ సిబ్బంది, గ్రామ సచివాలయ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు : మండల పరిధిలోని గోపవరం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్–క్రాఫ్ ఆధ్వర్యాన ప్రధానోపాధ్యాయులు ఎల్.నాగేంద్రరావు సహకారంతో బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమం వీధి నాటక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి జి.రాగ సుధ మాట్లాడుతూ గ్రామంలోని ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకుండా, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటివి జరిగితే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100, టోల్ ఫ్రీ నెంబర్ 112కి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు, మహిళా సంరక్షణ కార్యదర్శి జి.రాగ సుధాచ స్కూల్ టీచర్స్, ఎఎన్ఎం కె.నాగరత్నం, పిబిఎల్.కుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సులభ శైలిలో బోధించాలి : ఎంఇఒ

ముదినేపల్లి : ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సామర్థ్యానికి అనుకూలంగా సులభ శైలిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించాలని ఎంఇఒ–2 కె.నరేష్ కుమార్ సూచించారు. మండలంలోని చేవూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతులవారీ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఇంగ్లీష్, లెక్కలు వంటి సబ్జెక్టులపై విద్యార్థులకు ఉండే భయాలను తొలగిస్తూ బోధిస్తే ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనంపై హర్షం

నూజివీడు టౌన్ : నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనం చేస్తున్నందున త్రివిధ స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. నూజివీడు పట్టణం లోని త్రివిధ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, జూనియర్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు సుమారు 45 మంది నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతూ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు.

ఆపదలోని వారికి అండగా ఉంటాం : మంత్రి

నూజివీడు టౌన్ : ఆపదలో ఉన్న నాగరాజు కుటుంబానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని మంత్రి కొలుసు పార్థసారధి టిడిపి నాయకుల ద్వారా గురువారం అందజేశారు. ప్రజా సేవే నా సిద్ధాంతం అంటూ ప్రజా సేవలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మండలంలోని జంగంగూడెం గ్రామానికి చెందిన ఆర్.నాగరాజు విద్యుత్ సంస్థలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయనకు భార్య, ఐదు సంవత్సరాల చిన్నారి ఉండగా ఇటీవల హఠాత్తుగా గుండెపోటుతో నాగరాజు మరణించడంతో విషయం తెలుసుకున్న మంత్రి కుటుంబ సభ్యులను వర్చువల్లో ఓదార్చారు. టిడిపి నాయకుల ద్వారా సుమారు రూ.4 లక్షల నగదు బాధిత కుటుంబానికి అందజేశారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సిహెచ్.దుర్గాప్రసాద్, టిడిపి పట్టణ కార్యదర్శి పి.నాగరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు పి.హనుమంతరావు, పి.అశోక్, వి.భాస్కరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ముదినేపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి హాస్పిటల్ బిల్స్ నిమిత్తం మంజూరైన చెక్కులను గురువారం ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని కోడూరుకు చెందిన వేమూరి శ్రీరమాదేవికి రూ.1,21,329లు, పేరూరుకి చెందిన అవనపు పద్మావతికి రూ.25 వేలు మంజూరైన చెక్కులను ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ తన కార్యాలయంలో అందజేశారు.

కచ్చితత్వంతో ఓటర్ల జాబితా రూపొందిస్తున్నాం : కలెక్టర్

ఏలూరు : జిల్లాలో ఖచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌కి తెలిపారు. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వలసలు, ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో ఓటర్లు నమోదు, చనిపోయిన ఓటర్లను తొలగించకపోవడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటుచేసి వారి సూచనలు, ఫిర్యాదులను తీసుకుని ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని, ఫారం–7 దరఖాస్తు పరిష్కారానికి క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ధృవీకరించుకోవాలన్నారు. ఎన్నికల ఫొటో, ఓటరు గుర్తింపు కార్డులను నూరుశాతం పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

8న జంగారెడ్డిగూడెంలో నిర్వహణ

సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఈనెల 8న జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఏలూరు అన్నే భవనంలో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 9:30కు జంగారెడ్డిగూడెంలోని రోటరీ క్లబ్ హాలులో మహాసభ ప్రారంభం అవుతుందని చెప్పారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, జిల్లా రైతు సంఘం నాయకులు, జిల్లా నలుమూలల నుండి రైతు ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ఈ మహాసభలో జిల్లాలోని రైతాంగ సమస్యలపై తీర్మానాలు ఆమోదించడంతోపాటు నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని చెప్పారు. జిల్లాలో రైతాంగ సమస్యలపై రైతు సంఘం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందని, ఫలితంగా అనేక రైతాంగ సమస్యలు పరిష్కారం అయ్యాయని అన్నారు. ఈ మహాసభలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. రైతు సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

అవగాహన కల్పిస్తున్న ఆశ్రం హాస్పిటల్ సిబ్బంది

జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఏలూరులోని ఆశ్రం హాస్పిటల్స్ ఆధ్వర్యాన గురువారం ప్రజలకు ఏలూరు కొత్త బస్టాండ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహనే నివారణకు మొదటి అడుగు అని, కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చుని, వాటి లక్షణాలు స్క్రీనింగ్ పరీక్షల గురించి ప్రజలు తెలుసుకోవడం అందరి బాధ్యత అని ఆశ్రం హాస్పిటల్స్ డాక్టర్ సర్జికల్ అంకాలజిస్ట్ శైలజ సూర్యదేవర తెలియజేశారు. ఆవిధంగా కేన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 5వ తేదీన కేన్సర్ అవగాహన క్విజ్ పోటీలను వైద్య, ఆరోగ్య విద్యార్థుల కోసం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం కొత్త బస్టాండ్‌లో ఫ్లాష్ మాబ్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఆశ్రం హాస్పిటల్స్ సిఇఒ డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఎల్లప్పుడూ ఆరోగ్య సేవలు, వైద్య విద్యలో ముందంజలో ఉండేందుకు ఆశ్రం హాస్పిటల్స్ కృషి చేస్తుందన్నారు. త్వరలో ప్రారంభమవనున్న ఆశ్రం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా అంకాలజీతో పాటు వివిధ వైద్య చికిత్సలకు ప్రపంచ స్థాయి సేవలను అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో అందుతున్న నాణ్యత ప్రమాణాలను ఏలూరులో అందించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సింధు, డాక్టర్ సారధి, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శైలజ, డాక్టర్ చంద్రశేఖర్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణి, డాక్టర్ మౌనిక, ఆశ్రం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాసరావు, ఇతర వైద్యులు, పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి సహకరించాలి

సీలింగ్ ఫ్యాన్ల బహూకరణలో సర్పంచి మెండ ఝాన్సీ

ప్రజాశక్తి – మండవల్లి

ఫ్యాన్లు అందజేస్తున్న సర్పంచి దంపతులు

ఆటపాటలతో కూడిన విద్యను అభ్యసించే అంగన్వాడీ చిన్నారులకు దాతలు ముందుకు వచ్చి మౌలిక వసతుల ఏర్పాటుకు సహకరిస్తే అంగన్వాడీ సెంటర్‌లు మరింత అభివృద్ధి చెందుతాయని సర్పంచి మెండ ఝాన్సీ స్పష్టం చేశారు. మండవల్లిలోని అంగన్వాడీ ఆరవ సెంటర్‌కు సర్పంచి అత్తమామలైన కీర్తిశేషులు మెండ ఫిజికియ, థెరిస్సా జ్ఞాపకార్థం కుమారుడు, కోడలు మెండ సురేష్, ఝాన్సీ రెండు సీలింగ్ ఫ్యాన్లను గురువారం అంగన్వాడీ కార్యకర్తకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు రుచికరమైన పౌష్టికాహారం వండి పెడుతున్నారన్నారు. పౌష్టికాహారం అంగన్వాడీ చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా అంగన్వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు మంచి అలవాట్లు అలవాడతాయన్నారు. క్రమం తప్పకుండా చిన్నారులను అంగన్వాడీకి పంపి చిన్నతనం నుండే పాఠశాలల పట్ల చిన్నారులలో ఆసక్తిని పెంచాలని ఆమె కోరారు. దాతలు ముందుకు వచ్చి అంగన్వాడీలలో మౌలిక వసతుల కల్పనకు సహకారం అందిస్తే చిన్నారుల విద్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఆమె తెలిపారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపిడిఒ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

మండవల్లి : బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి ఆర్థిక సహాయాన్ని అందించడం ఎంతో సంతోషదాయకమని ఎంపిడిఒ రమణబాబు తెలిపారు. మండలంలోని చావులపాడు పంచాయతీ గుమస్తాగా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన పరస బుచ్చం శాస్త్రి కుటుంబాన్ని ఆదుకునే విధంగా కార్యదర్శులు, గుమస్తాలు, సర్పంచులు కలిసి చేసిన రూ.51 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన చేతుల మీదుగా గురువారం బుచ్చం కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణం అనేది చాలా బాధాకరమన్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ చావలిపాడు పంచాయతీలో గుమస్తాగా పనిచేసిన బుచ్చం శాస్త్రి చనిపోవడం కార్యదర్శులను, గుమస్తాలను కొంత బాధకు గురి చేసిందన్నారు. బుచ్చం శాస్త్రి కుటుంబాన్ని ఆదుకునే విధంగా కార్యదర్శులు, సిబ్బంది, సర్పంచులు స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు కొండలు, రాధిక గిరిజ సాయి ప్రదీప్ పాల్గొన్నారు.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు– నూజివీడులో
ఓ.యస్.నెం. 362 / 2024
బిట్వీన్ :
పానే శివ నాగరాజు .... వాది
మరియు
మాదు సీతా రామయ్య ... ప్రతివాది
టూ: ప్రతివాది
మాదు సీతారామయ్య తండ్రి. వెంకటేశ్వరరావు, వయస్సు సుమారు 48 సం., వృత్తి: వ్యాపారం, నివాసం: డోర్ నెం. 5–83, గొల్లపల్లి గ్రామం, నూజివీడు మండలం, కృష్ణాజిల్లా.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా ది.04–12–2025వ తేదీన అయివున్నది. సదరు తేదీన ఉదయం 10–30 ని.లకు పై పేర్కొనిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది గారి ద్వారా గానీ హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలుపు కొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురని తెలియజేయటమైనది.
మంకెన నరసింహారావు,
వాది తరపు న్యాయవాది, నూజివీడు,
ఏలూరుజిల్లా. సెల్ నెం. **9440882031**.
నూజివీడు ది.06-11-2025

బూరుగుపల్లి ఆంజనేయులు విగ్రహావిష్కరణ

ఉంగుటూరు : మండలంలోని చేబ్రోలు గ్రామంలో బూరుగుపల్లి భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన బూరుగుపల్లి ఆంజనేయులు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి రాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు ప్రజాప్రతినిధులు విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఆంజనేయులుకి నివాళులర్పించారు. అనంతరం పెట్రోల్ బంక్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నేతలు, గ్రామ సర్పంచి రాందే లక్ష్మీ సునీత, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర అఫైర్స్ కమిటీ కన్వీనర్‌గా అంబికా రఘు

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

అధికార పత్రాలు అందుకుంటున్న రఘు

విజయవాడలో జరిగిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో ఏలూరుకి చెందిన అంబికా రఘుకు రాష్ట్ర కన్వీనర్ బాధ్యతలు అందజేశారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవిఎఫ్) కార్యవర్గ సమావేశం విజయవాడలోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో గురువారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఏలూరుకి చెందిన కనుమర్లపూడి వెంకట వర్ధన్ రావు(అంబికా రఘు)ను రాష్ట్ర అఫైర్స్ కమిటీ కన్వీనర్‌గా రాష్ట్ర వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికార పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పలువురు వైశ్య నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార మహోత్సవం అనంతరం అంబికా రఘు ఎంఎల్ఎ బడేటి చంటిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అంబికా రఘు మాట్లాడుతూ రాష్ట్ర విభాగంలో ఐవిఎఫ్ పొలిటికల్ అఫైర్స్ రాష్ట్ర కమిటీ కన్వీనర్‌గా నియమించబడడం తన జీవితంలో గౌరవకారణమన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావుకి ధన్యవాదాలు తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE MACT CUM PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.V.O.P. 117/2025
Between:
Dasari Madhulatha being minor rep by her father and guardian D. Apparao ....Petitioner
And:
Sri P. Srinu and others .....Respondents
NOTICE
Address of the 2nd Respondent:
P. Vijaya Vara Prasad, S/o Krishna Murthy, Owner of Lorry AP 37 TJ 1088, Door No: 4-133, Chinnapalem Village, Poduru Mandal, West Godavari District.
The petitioner filed the above O.P. for grant of compensation on account of injuries sustained by the petitioner and the above O.P. is posted to **13.11.2025 at 10:30 A.M.** before the above Honourable court. Either personally or through an Advocate duly authorized by you, if you fail to appear on **13.11.2025 at 10:30 A.M.**, the matter will be decided in your absence basing on the material available on record.
U.V. Rajesh
Advocate, Door No: 15-1-21,
P. B. Road, Vizianagaram.
Cell : 9440309333.

అనారోగ్యంతో సిపిఎం నాయకులు పిచ్చియ్య మృతి

ఆగిరిపల్లి : దారం పిచ్చియ్య మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సిపిఎం మండల నాయకులు సత్తు కోటేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని అడవినెక్కలం అంబేద్కర్ నగర్‌కు చెందిన దారం పిచ్చియ్య(71) అనారోగ్య సమస్యలతో తన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలరు. సిపిఎం నాయకులు, పలు ప్రజాసంఘాల నాయకులు దారం పిచ్చియ్య భౌతికకాయాన్ని సందర్శించి, జోహార్లు అర్పించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు చౌటపల్లి రవి, బొడ్డు పుల్లయ్య(పూర్ణ), దారం ఆంజనేయులు, ఎమ్మిల చిన్నమ్మాయి, దారం కోటయ్య స్వామి పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ సమీపంలో లక్ష్మీ రామారావు ఆప్టికల్ షాప్‌లో తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి కృష్ణ మాట్లాడుతూ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామన్నారు. సేవా ట్రస్ట్ తరపున పేదలకు ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సబ్సిడీపై అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు వివరించారు. నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాలలోని ప్రజలు ఈ నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు : కోటదిబ్బ సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ కోటదిబ్బ సబ్ స్టేషన్‌లో 11 కేవీ కెనాల్, వివి.పేట ఫీడర్స్ పరిధిలో చెట్ల కొమ్మలు ట్రిమ్మింగ్ పనులు చేపడుతున్న కారణంగా ఈనెల 8వ తేదీ ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కెనాల్ రోడ్, వివి.పేట, సత్యనారాయణ పేట, బావిశెట్టివారి పేట మొదలగు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వికలాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ

ముసునూరు : రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంకల్పంతో వికలాంగులకు ట్రై సైకిల్ పంపిణీ చేసినట్లు టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో అధికారుల సమక్షంలో మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లోని ఏడుగురిని గుర్తించి వారికి ట్రై సైకిల్ పంపిణీ చేసినట్లు తెలియజేశారు. టిడిపి యువ నాయకులు టి.రంగారావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **TARAKASATYA SAIRAM KAMBALA** (New Name), S/o. Venkateswara Rao, Previously Called **KAMBALA TARAKA SATYA SAI** (Old Name), Resident of D.No:1-90, Kummara Veedhi, Satyavaram Village, Penumantra Mandal, W.G.Dt, Pin:534122, Andhra pradesh. I have changed my name from **KAMBALA TARAKA SATYA SAI** (Old Name) To **TARAKA SATYA SAIRAM KAMBALA** (New Name) for all practical purposes.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి (MACT) ఏలూరు వారి కోర్టులో
IA.No.1452/2025
O.P.No.153/2025
బిట్వీన్ :
కర్రి వెంకటకళ్యాణి మరియు మరియొకరు ...పిటీషనర్
మరియు
గొలుగూరి వెంకట శ్రీరామ్ ఆంజనేయ రెడ్డి ...రెస్పాండెంట్
Proposed Party : Gurrala Ramya, W/o.Chennamsetti Manoj Kumar, Owner of Car bearing No.AP-16-CP-0255, D/No.17-3-24, Gannabathivari Street, Palakollu, W.G.Dist.
పై నంబర్ గ్రంథంలో శ్రీకోర్టు ద్వారా పంపబడిన నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ద్వారా ది.24-11-2025వ ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కాని వకీలు ద్వారా కాని హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.
పి.రంగారావు
పిటిషనర్ తరపున న్యాయవాది
ఏలూరు తణుకు
తేది.6-11-25 సెల్: 9440321132

IN THE HONOURABLE COURT OF THE MACT CUM PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.V.O.P. 137/2025
Between:
Sri Dasari Apparao .... Petitioner
And:
Sri P. Srinu and others .... Respondents
NOTICE
Address of the 2nd Respondent:
P. Vijaya Vara Prasad, S/o. Krishna Murthy, Owner of Lorry AP 37 TJ 1088, Door No: 4-133, Chinnapalem Village, Poduru Mandal, West Godavari District.
The petitioner filed the above O.P. for grant of compensation on account of injuries sustained by the petitioner and the above O.P. is posted to **13.11.2025 at 10:30 A.M.** before the above Honourable court either personally or through an Advocate duly authorized by you, if you fails to appear on **13.11.2025 at 10:30 A.M.** the matter will be decided in your absence basing on the material available on record.
U.V. Rajesh
Advocate, Door No: 15-1-21,
P. B. Road, Vizianagaram.
Cell : 9440309333.